STATE CENTRAL LIBRARY A.P. HYDERABAD
44

# కాంతి కిరణం

రుద్రాభట్ల నరసింగరావు





కొత్త జంటలన్నిటి వంటిదే ఆ జంట కూడా. కాని ఆమె ఏదీ కోరదు; కోరి ఇస్తే మెచ్చుకోదు; కనీసం ఎందుకు అనైనా అనదు. ఇక మగవాడి మనసు ఎలా ఉంటుంది? 'రుక్కు' అలా కాదు. విధి వక్రించినా ఆమె చక్కదనమూ, చిరునవ్వూ, మాట తీరూ జాలితో నిండిన అతని మనసులో గాఢంగా హత్తుకొని పోయాయి; ప్రేమ చిగురించదా. మరి? వయసులో ఉన్న అందరికీ సహజమైన భ్రమ మాత్రమేనా ఇది? లేక నిజమైన ప్రేమా? అదీ రుక్మిణి తేల్చవలసిన సమస్య.

ఆ వేళ కూరల బజారులో 'బెండకాయలు వీశ ఎలాగోయి?' అని అడిగాడు రాజశేఖరరావు.

"ముప్పావలా బాబూ. లేత మొవ్వులు. వేసుకోండి. ఎన్ని వీశలు తూచమంటారు?' అని గడ గడ ఒప్పజెప్పి తక్కెడ సర్దుతున్నాడు కూరలవాడు— రాజుకు కాస్త ఆలోచించుకునే వ్యవధి ఇవ్వకుండా.

వ్యాపారులకు కొనేవాడు; పురుషుడు. స్త్రీకి; ప్రభుత్వానికి ప్రజలూ—ఆలోచించుకోవడం అంటే గిట్టదు.

"అరవీశే చాలు."

వాడు చక చక వీరి తూచుతున్నాడు.

'ఓరీ నీ అన్యాయం అడుక్కుతినా! పాపం ఆ అబ్బాయిని దగా చేస్తున్నావా?'

కూరలవాడు చేస్తున్నదగా ఏమిటో కని పెట్టడానికి బదులు, మాధుర్యం ఒలికించిన ఆ కంఠం వైపు చూడాలని పక్కకు తిరిగాడు రాజు.

ఇరవై ఏండ్లు నిండిన తనను అబ్బాయికింద జమకట్టి మాట్లాడిన ఆస్త్రీకి ముప్పై కంటే ఎక్కువ ఉండవు.

పాతిక కూడా ఉండవేమో అనిపిస్తుంది— మనిషి సన్నం గనుక. ఆమె పూర్తిగా ఎదగలేదు. పన్నెండేళ్లపిల్ల చీరకట్టినట్టుంది. జుట్టు ఒదులుగా ముడివేసుకుంది. ఒంటిని నగలులేవు. నుదుట బొట్టులేదు.

'నాకు పదణాలకిచ్చినవాడివి ఆయనకు ముప్పావలానా? పైగా ముదర కాయలన్నీ ఏరి పడేస్తున్నావా?' అందామె.

'రోజూ కొనేదానివి గదా అని నీకు నష్టపడి ఇచ్చాను తల్లీ. నీదే బోణీ బేరవాయె. మువ్వందరికీ రికమండీసనుచేస్తే ఎలా?' అని విసుక్కున్నాడు కూరలవాడు.

ఆమె రాజువైపు చూచి నవ్వుతూ 'మీకు బజారు పనుల్లో ఆట్టే అనుభవం లేదు కాబోలు' అంది.

కొత్తగా కాపరానికొచ్చిన పిల్లలా సిగ్గుపడి పోయాడు రాజు.

కూరలు చూసీ, వాటి ధరలు వినీ రాజు ప్రయోజకుడవుతున్నాడని మురిసిపోయింది వాళ్లమ్మ. కాని ఆవిడ కేం తెలుసు, అప్రయోజకత్వం ఎవరిదో?

కూడా సరిగా తినడం మానేశాడు.

ఏనాటి మంచో తన హృదయంలో తనకే తెలియకుండా దాగి ఉన్న సౌందర్యం ఏదో ఆకృతి దాల్చి ఈ వేళ సాక్షాత్కరించినట్టుంది అతనికి. నగ్నమే అయినా మసకగా కనిపించే ఉషస్సు స్పష్టమైన సూర్యోదయానికి తావు చేసి నట్టయింది. ఆఫీసుకు పోతూ క్రమంగా గ్రహించగలిగాడు రాజు తన హృదయమనిండా ఉన్నది ఆనందం కాదు, బాధ అని. త నేదో అందుకో లేననే ఆవేదన అది.

మరికొన్నాళ్ళపాటు ఆమె కనిపించలేదు. కూరల బజారులో ఎప్పుడూ తనకంటే ముందో వెనకో అయేది. రాజుకు ఆమెను మరోసారి చూడాలనే తహ తహ ఎక్కువయింది. తనలోని ఈ చికాకు, ఇంట్లో తనపెళ్లిమాటలూ భరించ లేకుండా ఉన్నాడు రాజు.

ఓ నాటి సాయంకాలం అతను ఆఫీసునుంచి వస్తూంటే హఠాత్తుగా కనపడింది ఆమె, పెద్ద బిందెతో వీధి చివరనున్న పంపునుంచి నీళ్ళు తెస్తూ. ఫర్లాంగు దూరం అంత బిందెతో పిట్టలా ఉన్న ఆమె నీళ్ళు తేవడం ఏమిటి? దుక్కల్లా ఉన్న ఆడవాళ్లంతా తిని కూర్చుని ఈ వితంతువుచేత చాకిరీ చేయించుకుంటున్నారు కాబోలు. కుచ్చెళ్ళు ఎత్తిపట్టుకుని, తలవంచుకు నడుస్తోంది ఆమె. ఆమె చిన్నిపాదాలూ, దబ్బ పండులా నిగనిగలాడే కాళ్ళూ చూచి ముచ్చట పడిపోయాడు రాజు.

మరో సారి కట్టెల అడితి దగ్గర కనిపించింది. ఛీ ఛీ, ఇంట్లోని మొగపనులూ, ఆడ పనులూ కూడా ఈమె నెత్తిన రుద్దే ఈమె పోషకులు సంస్కారం, హృదయం ఉన్నవాళ్ళేనా? ఈ చిన్న వయస్సులో ఈమెకు ఈ అవస్థ పట్టింది. దేవుణ్ణి, సమాజాన్ని తిట్టడం? అని ఉడికిపోయాడు రాజు.

ఆమె రాజును పలుకరించింది—ఎవరో పరిచితుల పిల్లవాణ్ణి పలకరించినట్లు చనువుగా.

వయస్సులో ఉన్న స్త్రీలు అతన్ని చూచి తొలగడం, సిగ్గు నటించడం మొదలయినవి చెయ్యడం—అంటే, అతను యువకుడయాడని అతనికి తెలియచెయ్యడం—మొదలుపెట్టి చాలా కాలమయింది.

ఈవిడకు అటువంటి అవసరం ఉన్నట్టు కనబడలేదు. వివిధ రకాల మనుష్యులతో వేగి మంచి లోకానుభవం గడించినట్టు కనిపిస్తూంది.

ఆమె నిండైన కళ్లలో మేఘాలూ, మెరపు తీగలూ ఉన్నట్టనిపిస్తుంది; ఆమె కష్టాల స్మృతులే ఆవల్లని నీడలు: ఆమె తెలివితేటలే ఆ మెరుపులు అని ఊహించుకున్నాడు రాజు.

'మీ పేరు?' అని అడగ సాహసించాడు.

'నా పేరెందుకండీ, అయినా, రుక్మిణి అంటారు' అందామె.

'రుక్మిణి!' ఇదే జపం అయిపోయింది రాజుకు—వేసంగిలో పెళ్ళయేదాకా. తర్వాత క్రమంగా రుక్మిణిని మరవసాగాడు కొత్తజీవితంలోపడి.

# కాంతి కిరణం


కాని, అదృష్టమోకాని దురదృష్టమో చెప్పలేం. రాజు పెళ్లాడిన అమ్మాయి ఎవరో కాదు రుక్మిణికి స్వయానా చెల్లెలు.

• • •

సత్యవతి కాపురానికి రావడం, రాజుకు బందరు బదిలీ కావడం కొంచెం ఇంచుమించు ఒకసారే జరిగాయి. రాజుదేమీ ప్రేమ వివాహంకాదు. మరే విశేషమూలేదతని పెళ్లిలో. పెద్దవాళ్ల పోరుపడలేక ఒప్పుకొన్నాడు పెళ్లికి రాజు. అదీగాక, వైవాహిక జీవితంలో ఆనందం అనుభవించాలనీ అతనికి ఉంది.

కొత్త జంటలన్నిటిలాగే గడిపారు సత్యవతీ రాజూ— వాగ్దానాలూ, చిన్నకానుకలూ, చిన్న చిన్న పరిచర్యలూనూ.

కాని క్రమంగా సత్యవతి తరహా నచ్చడంలేదు రాజుకు. చీరలూ, పువ్వులలాటి వేవీ కావాలనదు. తాను కోరి తెచ్చిస్తే పుచ్చుకుని వాడుతుంది.



అంతే. 'ఎంతబావుందండీ!' అన్నైనా మెచ్చుకోదు. 'ఎందుకండీ ఇలాటివన్నీ?' అన్నమాట రాల్చినా ఆమె తనపట్ల కృతజ్ఞత చూపినట్లు భావించుకుని పొంగిపోయి ఉండును రాజు. కాని సత్యవతి (రాజుమాటల్లో) 'ముంగి'లా మాట్లాడదు.

రాజు ఉదాసీనంగా ఉంటున్నాడు. ఆమె తనకు చేసే పరిచర్యలను చూసీ చూడనట్లు ఉంటాడు. ఆమె కేమీ తేవడం మానేశాడు. ఇంట్లోకి కావలసిన సరుకులైనా ఆమె చీటిముక్క రాసిస్తేనే పట్టుకు రావడం.

ఈ కొత్త జీవితంలో మొట్టమొదటిసారి రాజు చికాకు కనపరచినది ఒక నాడు భోజనం దగ్గర.

'పప్పు వండలేదేం?'

'లేదు.'

ఆ సంగతి తనకూ తెలుసు. అయినా ముక్తసరిగా ఆ జవాబేమిటి?

'కొట్టు కట్టేశారని చెప్పి, నిన్న మీరు పప్పులు పట్టుకు రాలేదుగా? అందరిళ్లకూ అప్పుకు బయల్దేరడంఅంటే నాకుసిగ్గుసుమండీ' అని సత్యవతి ఏవో నాలుగు మాటలు చెప్పుకుంటే ఊరుకునేవాడేమో తను. 'లేదు'ట! లేదు!...... భోజనం చేస్తున్న మొగాడికి కడుపునిండిపోయే మాట.

తర్వాత చాలాసార్లు చూశాడు రాజు—సత్యవతిని ఏదైనా అడిగినా, తిట్టినా అవసరం అయితే ఒకటి రెండు మాటల్లో సమాధానం చెప్పడమో ఊరుకోవడమో చేస్తుందామె. ఎదురు జవాబివ్వడమూ ఎరుగదు. సంజాయిషీ అయినా చెప్పుకోదు.

ఇలాటి మౌనం రాజులాటి మనిషికి తప్పకుండా కోపం తెప్పిస్తుంది. తిట్టినప్పుడు ఎదురు తిరగలేదు. అంటే తన తప్పు ఒప్పుకుంటున్నట్టే గద? పోనీ, సత్యవతివల్ల తప్పు లేదనుకుందాం, సంజాయిషీ అయినా చెప్పుకోవాలిగద ఆమె? ఇవేమీ చెయ్యకుండా మూతి బిడాయించుకుని బెల్లం కొట్టిన రాయిలా ఉండడం అనేది అహంభావంవల్లనూ; 'నీ లెక్క నాకేవి' టనే పొగరు వల్లనూ జరుగుతుందనుకుంటాడు రాజు.

ఈ మౌనం సత్యవతిలో ఓ సుగుణం కాదని రాజు అనుకోడానికి ఇంకో కారణం ఉంది. భర్తను సాధించడంలోనూ, మూతి ముడుచుకోవడంలోనూ సత్యవతితోటి ఆడవాళ్లకంటే ఏడాకులు ఎక్కువే చదివింది. ఇంటిలోని పోరు పడలేక ఆఫీసుకు ముందుగా పోయి పని చూసుకుంటున్నాడు రాజు. మునుపటిలా ఇంటికి రావడం మానేసి క్లబ్బులోనే కాపురం పెట్టాడు సాయంకాలం పూటలు.

స్నేహితురాళ్లెక్కువ సత్యవతికి.

ఒకసారి ఇంటికి వస్తూనే ఈ మాటలు విన్నాడు రాజు:

'ఆయనకు ఇల్లూ వాకిలీ పడుతుందటే పద్మా? ఇంటి కంటే గుడే పదిలం అన్నట్టు ఈ మగరాయుళ్లంతా వీధుల్లోనూ,క్లబ్బుల్లోనూ పెత్తనాలు చేస్తారు.'

కాఫీ ఇవ్వడానికి సత్యవతి వచ్చినప్పుడు కనుబొమలు చిట్లిస్తూ అన్నాడు రాజు: 'వాళ్లందరి ముందూ అలాగేనా మాట్లాడేది ? నీకేమైనా బుద్ధీ, జ్ఞానం ఉందీ?'

సమాధానం—మూతివిరుపూ, జడవిసురూ, విసవిస నడకానూ.

ఆవిరి కన్నెలను పంపి నాట్యం చేయించిన కాఫీకప్పు తన్ను చేరదీసేవారు లేక శూన్యమైన గదివంక బిక్కమొగం వేసి చూస్తూ కూర్చుంది.

కొంతసేపటికి సత్యవతి వచ్చి కాఫీ కప్పు వంకచూచి బొమ్మలా నిలబడి పోయింది. నెమ్మదిగా కప్పు తీసుకుని తలవంచుకుని లోపలికి వెళ్లిపోయింది.

వంటింటి గుమ్మానికి ఆనుకుని, ఎక్కడవో ఉన్న చూపులతో, పరధ్యానంగా కూర్చుండి పోయిందామె.

'కాఫీ తాగకుండా తరిమావు! ఇంత పిండా కూడైనా పడేస్తావా ఈ వేళకు?' అన్న ఉరుము విని తుళ్ళిపడి లేచి పీట వెయ్యడానికి పరుగులు తీసింది సత్యవతి.

ఈ దాంపత్యం ఇంతసొంపుగా సాగుతూ ఉన్న సమయంలో రుక్మిణి వచ్చింది ఆ ఇంటికి.

రాజు చీకాకంతా ఏమయిపోయిందో తెలీదు. మునురు దినాల యమబాధ తర్వాత సూర్యుని సువర్ణకాంతి అనుభవించినట్టయింది రాజుకు రుక్మిణి ముఖం కనబడగానే.

ఆ ఉదయం గదిలో మీనమేషాలు లెక్క పెడుతూ కూర్చున్నాడు సెలవు గనుక.

వీధిలో బండి ఆగిన చప్పుడు.

నడవలో సత్యవతి నవ్వుతూ 'ఏవక్కయ్యా! ఇన్నాళ్ళకు మేం జ్ఞాపకం వచ్చాం కామోసు!' అని పలకరిస్తూంది.

రుక్మిణి నడవలోకి వచ్చింది. 'మరే, నువ్వంటే మమ్మల్ని పూర్తిగా మరచిపోయావు గాని' అంది.

నడవలోకి వెళ్ళాడు రాజు.

'ఏం రాజశేఖరరావు, కులాసా?'

'ఆ, ప్రయాణం సుఖంగా సాగిందా?'

'దీనికేముందయ్యా, ఎప్పుడూ ఉండేదే? ఆ జీవయాత్ర గడవడమే గడవడం.'

'ఏం వదినా, వేదాంతంలో పడ్డారు?'అన్నాడు రాజు పైకి నవ్వుతూనే.

కాని లోపల బాధపడుతున్నట్లు కనిపించాడు. అన్నగారింట్లో బాధలు పడలేక చెల్లెలి ఇంట్లో కొన్నాళ్ళయినా సుఖంగా ఉందామనే ఆశతో వచ్చింది రుక్మిణి అనుకున్నాడు. ఆమె మాటలవల్ల రాజు. సానుభూతి, ఆదరణా దొరకక కష్టాలలో ఉన్న ఆడవాళ్ళ శరణు జొచ్చేది వేదాంతాన్ని గాక మరి దేన్ని?

రుక్మిణి వచ్చిన తర్వాత రాజు దినచర్య మారిపోయింది. ఆఫీసుకు వీలయినంత ఆల స్యంగా వెళ్ళేవాడు. వెళ్ళేటప్పుడు 'వదినా, తలుపు వేసుకోండి' అని పిలిచి రుక్మిణి వచ్చే దాకా అక్కడే నిలిచేవాడు. ఆఫీసు పని మొక్కు బడి కాస్త చెల్లించుకోగానే ఆఘమేఘాలమీద తిన్నగా ఇంటికి వచ్చేసేవాడు. దిక్కుమాలిన పేకాట లెందుకిప్పుడు రాజుకు. ఎంతో ఆప్యా యతతో పలకరించి మాట్లాడే రుక్మిణి అతని ఇంట్లోనే వెలిసి నప్పుడు?

సత్యవతి మొదట సంతోషించింది. కాఫీ ఇచ్చేటప్పుడు చిరునవ్వును కూడా ఒలకపోసింది, కాని భర్త—'మీ అక్కయ్య ఎక్కడ?' అంటూ రుక్మిణి కనిపించడం ఒక్క క్షణం ఆలస్య మయితే ఇల్లంతా కలయ దిరగడం చూచి ఆమె మళ్ళీ మూతి బిగించుకుంది.

ఇది మాత్రం పసిగట్టిన రాజు 'ఆఫీసునుంచి వచ్చీ వెడీ పనిచేసి వస్తే ఎందుకలా మొగం మాడ్చుకుని ఉంటావు?' అని ఒక్క కేకవేశాడు.

రుక్మిణి వచ్చింది.

'చూడు వదినా! దీనికి నేను బతికుండడమే కష్టంగా ఉన్నట్టుంది.'

'పోనీలే రాజశేఖరం అంతమాటనకు. ఏమే సత్యవతీ?' అంది రుక్మిణి.

సత్యవతి అంతకుముందే వెళ్ళి పోయింది లోనికి.

రుక్మిణి గడపలో కూర్చుంది. 'ఇంకా చిన్న తన మయ్యాదానికి. ఏదో నర్దుకు పోతూండాలి. క్రమంగా అదే నేర్చుకుంటుంది. నీ కిష్టమన్నా రన్నావే, కాశీభట్ల వా రమ్మాయి సుబ్బులక్ష్మి అదుగో వాళ్ళమ్మా, నేనూ ఓతోటి వాళ్ళం. చిన్నప్పుడు మహాపెంకె. మొగుణ్ణి నానాతిప్పలూ పెట్టేది. తొలిచూలు పిల్ల పుట్టగానే ఎంచక్కా సంసారం దిద్దుకుంటూ అణకువగా మెసిలింది. ఆడవాళ్ళంతా అంతేనయ్యా......' అని ఏవో కబుర్లు చెప్పసాగింది.

రాజు కట్టుబడిపోయి వింటున్నాడు.

రుక్మిణి కబుర్లు వింటూంటే మాట్లాడం కూడా ఒక కళ అనిపించింది రాజుకు. దైవ దత్తమైన కమ్మని కంఠమూ, సాధనావసరం—రుక్మిణిలా విన సొంపుగా ఎంతసేపు విన్నా తనివి తీరవట్లుగా కబుర్లాడ్డానికి.

భోజనాలవగానే డాబామీదకుపోయి పడు కునేవారు. సత్యవతి దూరంగా లైటు పెట్టు కుని ఏవో కథలు, పత్రికలూ చదువుకుంటూ ఉంటుంది

రాజు నక్షత్రాల్ని కూడా వదిలి రుక్మిణి కళ్ళలోనికి తదేకంగా చూస్తూ కూర్చుంటాడు మై మరచి.

రుక్మిణి అతని ధ్యానాన్ని మరలించడానికా అన్నట్టు ఏదో చూస్తూ ఏమో చెపుతూ ఉంటుంది.

'పిండారబోసినట్లుంది కదూ వదినా ఈ వెన్నెల?'

'అవునయ్యా. ఈ వెన్నెల చూస్తూ ఉంటే ఏదో జ్ఞాపకం వచ్చినా కడుపులో దేవినట్లుంటుం దయ్యా. విశాఖపట్నంలో దేవరకొండవారి రెండో పిల్లకు బోలెడు కట్నం ఇచ్చి పెళ్ళి చేస్తే, పాపం దానిరాత కెవరేం చేస్తారు. అతను సంవత్సరం తిరక్కుండానే క్షయ జబ్బుతో చచ్చిపోయాడు. పోయేటప్పుడు అతనికిలాగే కిటికీలోనుంచి తెల్లని మబ్బులూ చందమామా కనిపించాయి. అతను పెళ్ళాన్ని దగ్గరకు పిలిచి ఏదో పాట పాడాడు. 'జాబిలివి నువ్వు, నిన్నలముకునే తెలిమబ్బు నేను.....' ఇంకా ఏవిటమ్మా.... ఆ... 'మన్ని దూరంచేసే గాలి విధి.....' అని ఏమేమో పాడాడు. నా కింకా జ్ఞాపకం ఉంటుందా ఏవిటి? పదిహేనేండ్ల నాటి మాట. పాపం ఆడవికాచిన వెన్నెల అయిపో యింది దాని బతుకు...' అంది రుక్మిణి చంద్ర మండలాన్ని దాటిపోయినట్టు ఉన్న చూపులతో.

మరో రాత్రి కొడుకు పుట్టాడని ఆనాడు తన స్నేహితుడు చేసిన పెద్ద టీ పార్టీ గురించి చెప్పాడు రాజు.



గోపికా వల్లభుడు

చిత్రం-మారేమండ శ్రీనివాసరావు (గుంటూరు)

'టీపార్టీ ఏవిటి? ప్రభల్లక్ష్మన్నరసయ్యకు కొడుకు పుట్టినపుడు బారసాలనాడు ఆడా మొగా మూడు వందలమంది భోంచేసిలేచారు. నన్ను వెంటబెట్టుకు వెళ్ళింది మా అమ్మ. సత్యవతి కడుపులో ఉంది. అప్పటికింకా పుట్ట లేదు ఈ బొట్టె' అంది.

తన చిన్నతనపు మధుర స్మృతులు ఆమె కళ్ళను మరింత మెరిసేలా చేశాయి.

రాజు ఎందుకో బరువుగా నిట్టూర్చి తల వాల్చాడు.

'ఎందరి పుట్టు పూర్వోత్తరాలు తెలుసు రుక్మిణీ నీకు! జీవితంలో అనేక వ్యక్తుల సుఖదుఃఖాల చరిత్ర సంపుటానివి నువ్వు!'

రుక్మిణి చకితురాలైంది. వదినగారైన తనను పేరుపెట్టి పిలిచాడని ఆమె అంత పట్టించుకోలేదా సమయంలో. త నెన్నో జీవి తాలను చూసినందుకు రాజు ఆశ్చర్య పడుతూ అంత దిగులుగా ఉన్నాడేమి అని విస్తుపోయింది.

'ఏం అలా ఉన్నావు రాజశేఖరం?' అనడిగింది ఆదుర్దాగా రుక్మిణి.

అధరం బిగబట్టి ఏదో బాధను అణుచు కుంటున్నట్టు కనిపించాడు రాజు

రుక్మిణి మళ్ళీ సాదరంగా 'ఒంట్లో బాగా లేదటయ్యా?' అంది

'నీకు చెప్పలేను రుక్మిణీ, కనీసం ఇప్పట్లో చెప్పలేను. చెప్పినా అర్థం కాదేమో. నాకు ఒక్కటే కోరిక. ఇకముందెప్పుడూ ఏనాడో కన్నవీ, విన్నవీ గాథలన్నీ నాకు చెప్పకు. నిన్న మొన్న జరిగిన సంగతులేమైనా కబుర్లుగా చెప్పుకుందాం రుక్మిణీ. అంతేగానీ పాతకాలపు కథలను రానీకు మన మాటల్లోకి' అని గబగబ డాబాదిగి వెళ్ళిపోయాడు రాజు.

రుక్మిణి నిర్విణ్ణురాలై పోయింది. అతని వింత ప్రవర్తనను అర్థం చేసుకోడానికి ఆమె

తీవ్రమైన ఆలోచనలో పడిపోయింది.

రాజు సిగరెట్టు ముట్టించి గదిలో పచార్లు చెయ్యసాగాడు.

కాని ఇదే సమయంలో రుక్మిణి రాకకు పూర్వం రాజు ఇంటి పట్టున ఉండడం లేదని అతనిని సాధించిన స్త్రీకి, ఇటీవల అతను ఇంటికి రావడమే భరించలేని బాధగా ఉందని ఎవరికి తెలుసు?

* * *

రాజు స్నేహితుడి కొడుకును ఉయ్యాలలో పెడతారట. వాళ్ల ఆడవాళ్లొచ్చి సత్యవతిని పేరంటానికి పిలిచారు.

సత్యవతికి మహా చెడ్డ విసుగు కలిగి ఒకసారి అరిచింది—ఆమె పుణ్యమా అంటూ, వాళ్ళు వెళ్లిన తర్వాతే.

'పేరంటాలకు, పెళ్లిళ్లకు కూడా వెళ్లడం ఏమిటి నా మొగానికి—'

'అయ్యయ్యో అవేం మాటలే—?' రుక్మిణి.

'నీకేం తెలుసక్కయ్యా నేను పడే బాధలు? ఉన్న ఒక్క గుడ్డా చాకలాడికి వేస్తే పది హేను రోజులయినా వాడింట్లో పెట్టుక్కూచున్నాడు. అమ్మా, అయ్యా వెళ్లిపోయిన ఆడదానికి ఓరవికె గుడ్డ ఆశయినా లేదుగదా పుట్టింటినుంచి? ఇక అత్తింటి వారికా, నేను బతికానో చచ్చానో కూడా అక్కర్లేదు.....'

అత్తింటి తరపున ఆ ఇంట్లో ఉన్నది ఆమె భర్త ఒక్కడే. పక్క గదిలోనే ఉన్నాడు, రాజు. సత్యవతి కేకలు విని అతనికి కోపంరావలసింది. కాని రాలేదు. తన తప్పిదం తాను తెలుసుకున్నట్టు కొంచెం విచారంగా అవుపించాడు.

మరునాడు ఉదయం ఓ మూటతో వచ్చి 'రుక్కూ, చూడు నీ కేరంగులు నచ్చుతాయో' అన్నాడు రాజు.

నీలిచీరకట్టుకుని, జుట్టు ఆరబెట్టుకుంటూ బియ్యం ఏరుతూ ఉంది రుక్మిణి.

హఠాత్తుగా తన ముందా మూట చూస్తూ రాజుపిలుపు విని కొంచెం తెల్లబోయింది రుక్మిణి.

'సత్యవతికేనా? అదే ఎంచుకుంటుంది పిలుస్తా నుండు' అని లేవపోయింది రుక్మిణి.

'అక్కర్లేదు. ముందు నీ క్కావలసినవి ఎంచు రుక్కూ' అన్నాడు రాజు ప్రాధేయపూర్వకంగా.

'నా కిప్పుడు చీర లెందుకయ్యా...' అని ఏమో చెప్పపోయింది.

'సర్లే. కొట్లో తిరిగి ఇచ్చేస్తాను.

రాజుకోపం చూసి రుక్మిణి నవ్వింది.

ముఖమూ, ఒళ్లూ అంతా పరుచుకున్న ఆమె జుట్టులోనుంచి ఆ నవ్వు, చీకటిరాత్రి చెరువు నీళ్లలో తొణికే నెలవంక సౌందర్యాన్ని తలపించి రాజు కోపాన్ని ఎగర కొట్టింది.

రుక్మిణి రెండు చీరలు ఎంచింది. బతిమాలినా సత్యవతి చీర తీసుకోలేదు. రుక్మిణి తన కొక్కటే అట్టే పెట్టుకుంది.

మిగిలిన చీరలు షాపులో తిరిగి ఇచ్చెయ్య


## కాంతి కిరణం

డానికి వెళ్ళుతున్నప్పుడు రాజు ముఖంలో కోపం పసిగట్టి సత్యవతి ఏదైనా సంతృప్తిని పొందింది.

''పాపం, అదేవిటే సత్యవతీ, ఇంతా కష్టపడి అతను నీకో సవని చీరెలు తెస్తే తిప్పిపంపేశావు?' అంది రుక్మిణి—సత్యవతి ప్రవర్తనకు కారణం వివరంగా తెలుసుకోగోరుతున్నట్టు.

సత్యవతి నిశ్చలంగా ఎక్కడో చూస్తూ అంది: 'ఇంటి కొచ్చిన వాళ్లను అవమానం చెయ్యడమే గొప్ప అనుకుంటున్నారాయన!' అని గబుక్కున రుక్మిణి వైపు తిరిగి అరిచింది: 'అసలు నువ్వేం దుకూరుకున్నా వక్కయ్యా, ఆయన నిన్నలా పిలిస్తే, గట్టిగా బుద్ధిచెప్పక? నేనయితేనా!'

రుక్మిణి కూడా కొంచెం చిన్న బుచ్చుకున్నట్టే ఉంది— మరిది వదిన గారల మధ్య ఉండవలసిన మర్యాదను రాజు అతిక్రమించి నందుకు. చెల్లెలి ఇప్పటి కోపపు మాటల్లో తనపట్ల సానుభూతి కనబడుతూంది. కనక రుక్మిణి తనకు కలిగిన



బాధ సత్యవతి దగ్గర వెళ్లబోసుకునేదే.

కాని రుక్మిణి బుద్ధి ఎక్స్రేలాటిది. వ్యక్తుల మాటలూ, చేతల వెనక ఉన్న మనోభావాలను ఇట్టే పసికట్టేస్తుందామె.

ఇప్పుడు సత్యవతి అన్న మాటలకు కారణం— తన ఇంటికి వచ్చిన తన అక్కయ్యను భర్త చిన్న చూపు చూశాడనే కోపం కాదు. ప్రేమతో 'రుక్కూ' అని పిలవగలిగేటంత చనువు అక్కయ్య దగ్గర తన భర్త కెలా ఏర్పడిందనే అనుమానం.

రుక్మిణి గ్రహించిం దీ సంగతి.

'ఏదో చనువుకొద్దీ పిలిచాడు పోనిద్దూ.'

'కా దక్కయ్యా. పెట్టి పోషిస్తున్న ప్రతి వాడికీ ఉంటుం దీ గర్వం. పెళ్లాం పిల్లల పట్ల చెల్లుతుంది గానీ ఈ గర్వం, అందరిపట్లనా? ఈవేళ నా ఇంట్లో పట్టెడు మెతుకులు తింటావు, రేపు వెళ్లిపోతావు. యావజ్జీవం ఆయన సంపాదన తిని పడిఉంటే నన్ను నానా మాటలూ అన్నట్టే నిన్నూ అంటే ఎలా ఉంటుంది? లోకానికైనా వెరవొద్దూ?'

సత్యవతి దీనికింత రాద్ధాంతం చెయ్యడం రుక్మిణికి వెగటు కల్గించింది.

ఏదైనా తను మళ్లీ ఆ అన్నగారింటికి వెళ్లిపోవడమే ఉభయులకూ శ్రేయస్కరం అనుకుంది. కానీ కొద్దిరోజులాగి వెళ్లడం మంచిది. వెంటనే వెళ్లిపోతే తనకు కోపం వచ్చినట్టు భావించుకుని వీళ్ళు బాధపడగలరు.

* * *

కాని ఆమె తన ప్రయాణపు ఉద్దేశ్యాన్ని వెల్లడి చేయక ముందే ఓ అవాంతరం వచ్చిపడింది.

ఒక అర్ధరాత్రి సన్నగా మూలుగు వినిపించే సరికి దభీమని లేచి కూర్చున్నాడు రాజు.

గుండెలమీద చెయ్యి వేసుకుని హాయిగా నిద్రపోతూంది సత్యవతి.

'ఈ ఆడవాళ్లది మొద్దు నిద్ర. సొంత అక్కయ్య బాధతో మూలుగుతున్నా ఇటునుంచి అటు ఒత్తిగిలనైనా ఒత్తిగిలదు ఈవిడగారు' అనుకుంటూ లేచి రుక్మిణి మంచం దగ్గరకు వచ్చాడు రాజు.

'ఏం రుక్కూ ఒంట్లో బాగులేదా?' అన్నాడు రాజు ఆమె నుదిటి మీద చెయ్యి ఉంచుతూ.

రుక్మిణి వెంటనే మూలుగు ఆపేసింది. 'అబ్బే ఏంలేదయ్యా, కొంచెం పళ్లనలుపు, అంతే, నువ్వెళ్లి పడుకో' అంది.

'పళ్ల సలుపే!?' అదంటే భయం రాజుకు. బొందితో నరకానికి లాగుకువెళ్లే రోగాలలో పళ్ల సలుపు రొమ్ము విరుచుకు తిరుగుతుంది.

'అయ్యో రుక్కూ, నీ కొచ్చిపడిందేమిటిది?' ఏడుపును మింగుతున్న గొంతుతో పలికి ఆమె మంచంమీద చతికిలబడి తేలికగా దవడపై రాస్తున్నాడు రాజు.

'ఫర్వాలేదయ్యా వెళ్లి పడుకో' అంది మరో మాటు రుక్మిణి.

కొంతసేపటికి లేచి బరువుగా వెళ్లి పడుకున్నాడు గాని రాజుకు నిద్రపట్టలేదు.

ఉదయమే డాక్టరుగారి దగ్గరికి పరుగెత్తి మాత్రలు పట్టుకొచ్చాడు రాజు.

ఆమెచేత ఆ మాత్రలు మింగించాడు.

పైకి దవడ అంతా వాచిపోయి ముఖాన్ని కొంచెం వికృతం చేసింది.

రాజెంతో బాధపడుతున్నట్టు అతనిముక్కుకు దిగువగా ఇరుపక్కలా ఏర్పడిన ముడతలుచూస్తేనే తెలుస్తూంది. అతనామె దవడరాస్తూ అలాగే కూర్చుండిపోయాడు. కాని అతనికి ఆమె వికటమైన ముఖం రోత కలిగించినట్టుంది. ఎప్పటిలా రుక్మిణి ముఖం వైపు తదేకంగా చూడకతల తిప్పుకుని కూర్చున్నాడు.

'మీరింక స్నానానికి లేవండి. ఆఫీసుంది ఈ వేళ' అంది సత్యవతి వచ్చి.

రుక్మిణి మొదటినుంచీ వెళ్లమంటూనేఉంది.

రాజుకు ఒళ్లు మండింది. 'ఆఫీసుందీ? లేదనుకున్నానేం. వెక్కిరించినట్టు వెధవ మాటలూ

మువ్వూనూ' అని కసిరి చివాలున లేచిపోయి నీళ్ల తొట్లె ఖాళీచేసి నాలుగు మెతుకులు తినిలేచాడు రాజా.

తాంబూలం సిద్ధంచెయ్యడానికి గదిలోనికి వచ్చింది సత్యవతి.

అసూయ వల్ల ఆమె ముఖం ముడుచుకుని ఉండడం కనిపెట్టాడు రాజా. ఇంతవరకూ అణచి పెట్టుకున్న అతనికోపం ఒక్కసారి పైకుబి కింది.

'నువ్వుపెట్టిన వెధవతిండికి తోడుతాంబూలం కూడా ఎందుకు? తోడబుట్టిన దానివైయుండీ అక్కయ్యంత బాధపడుతూ ఉంటే ఒక్కపిసరు అభిమానం లేదేం?' అని అరిచాడు.

సత్యవతిది మాటపడే స్వభావం కాదు. భర్త మాటలకు ఆమెకు పౌరుషం వచ్చింది. 'నేనేం చేసినా అక్కయ్యబాధ ఉపశమించడానికి చేస్తాను' అని ఏమో అనబోయింది.

'మరి నేను దేనికి చేశానంటావు రుక్మిణికి ఉపచారం? ఆమె స్పర్శవల్ల సుఖం పొందడానికా?' అని రాజా అమిత ఆగ్రహావేశంలో సత్యవతి చెయ్యి మెలిపెట్టి ఆమె బాధగా అరిచేటప్పటికి ఒక్క తోపు తోసి ఆఫీసుకు పారిపోయాడు.

సత్యవతి లేవలేకపోయింది కొంతసేపటిదాకా. శరీరం నొప్పికాదు. మర్యాద గల ఆడవాళ్లున్న చోట కలనైనా తలచకూడని సంగతులు మాట్లాడుతున్నారాయన నా కర్మ అనే బాధ ఆమెకు శరీరాన్ని కదిలే్చ శక్తిలేకుండా చేసింది.

ఆ రోజు సత్యవతి భోజనమే చేయలేదు—

—రుక్మిణి ఎంత చెప్పినా అక్క దవడకు ఏదో ముద్ద రుద్ది కావడం పెడుతూ కూర్చుంది. రుక్మిణికూడా మౌనంగానే ఉంది ఏదో ఆలోచించుకుంటున్నట్టు.

ఆ రాత్రి ఇంటికొచ్చిన భర్తను చూచేటప్పటికి సత్యవతికి కొంచెం భయం వేసింది. అతని కళ్లూ, ముఖమూ ఎర్రగా ఉన్నాయి.

ఉదయం వేళ కొంచెం మామూలుగానే ఉండి ఆఫీసుకు వెడుతున్నాడు రాజా.

కాని ప్రతి సాయంకాలమూ ఏదో కొత్త భయాలను సత్యవతి చీకటి హృదయం కొట్టులో బంధిస్తున్నాడు.

ఇంట్లో ఉన్నంతసేపూ తన రెండు పెద వుల్నీ కలిపి కుట్టేసుకుంటున్నాడు.

రుక్మిణికి దవడ సలుపు తగ్గింది. కాస్త తోడుగా ఉంటున్న ఆమె కూడా వెళ్లిపోతాననేటప్పటికి సత్యవతికి దిక్కు తోచలేదు.

కాని ఆమెను ఉండమనలేకపోయింది.

రాజా బొత్తిగా తిండి తగ్గించేసుకున్నాడు. ఈ మాటే అనబోయింది ఓసారి రుక్మిణి అతనికి మామూలుగా వడ్డిస్తూ.

'అదెక్కడ చచ్చింది? మొగుడికి ముద్దవడ్డించ డానికి కూడా తీరిక లేక ఏడుస్తోందా ఏమిటి?' అని ఒక కేక వేశాడు రాజా నిశ్శబ్దంగా నిలబడ్డ కొండల మధ్య ఫిరంగి పేల్చినట్టు.

రుక్మిణి తుళ్లిపడింది. అసలే ఆమె గుండె నరాలు బలహీనమైనవి.

గబుక్కున పరుగెత్తుకొచ్చింది సత్యవతి.

కాని ఏం లాభం అప్పటికే కంచంలో నీళ్ల పోసి లేచిపోయాడు రాజా.

అప్పటినుంచీ భోజనాల గది చాయల కనబడ లేదు రుక్మిణి. వంట వండేది. రూపుదాల్చిన దైన్యంలా ఒదిగి కూర్చునేది అక్కడే. చెల్లెలికి అందిస్తూ ఉండేది పదార్థాలు.

ఇందంతా గ్రహించిన రాజుకు దుఃఖం వల్ల అసలే సయించేదికాదు అన్నం.

సత్యవతికి రాజుమీద విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది. భర్త ఒంటికేం తెచ్చిపెట్టుకుంటాడో అని ఆమె హృదయం విలవిలలాడి పోయేది.

ఇంత బాధలోనూ ఆ స్త్రీ హృదయంలో కొంచెం అసూయ లేకపోలేదు. తాను వడ్డించడంభర్తకు గిట్టదనే ఊహ ఆమెను వశపరుచుకుంది. భర్త ఎంత దాచజూచినా ఆయన హృదయంలో రుక్మిణికున్న స్థానం తనకు లేదనే అనుమానం సత్యవతి మనస్సులోతిరుగాడుతూంది. ఇటీవల ఉడికిపోతున్న వాతావరణం భరించలేక బయట తిరిగే విషసర్పంలా.

అందుకే ఉండమనలేకపోతూంది అక్కయ్యను.

నడవడానికి కూడా శక్తి లేనట్టు కొంచెం తూలుతూ వస్తున్నాడు రాజా ఇటీవల.

మాట్లాడుతామంటే భయం, సత్యవతికి.

పోనీ ఒళ్లు ముట్టుకు చూద్దామంటే రాజా ఎప్పుడూ పెద్దపులిలా మేలుకునే ఉంటున్నాడు.

ఈ అనర్థం చాలాదూరం పోతుందని భయ పడి, రుక్మిణి పెట్టె సర్దుకుంది.

కాని ఆ సాయంకాలం రిక్షాదిగి లోనికి అడుగు పెట్టిన రాజును చూచి ఇద్దరు ఆడవాళ్లూ నిశ్చేష్టులయారు.

వాన్‌గో 'సెల్ఫ్ పోర్ట్రెయిట్'లా ఇంజన్‌లోని రాక్షసి బొగ్గులాగ వెలిగిపోతున్న రాజా బూట్లయినా విప్పకుండా పరుపు మీద పడిపోయాడు.

సత్యవతి భర్త నుదుటి మీద చెయ్యివేసి నిప్పు ముట్టుకున్నట్టు వెనక్కుతీసి 'అక్కా' అని అరిచింది రుక్మిణి పక్కనే ఉన్నా.

• • •

డాక్టరు వచ్చి పరీక్షచేస్తూ 'కోమాస్టేట్‌లో ఉన్నారీయన' అన్నాడు, లేక, అనుకున్నాడు.

కోరలు బయటపెట్టిన నల్లత్రాచులా ఉందా మాట 'కోమా!'. సత్యవతి వణికిపోయింది.

ఒక ఇంజక్షనిచ్చాడు, డాక్టరు.

'ఫర్వాలేదు. మళ్లీ రెండు గంటల్లో వచ్చి ఇంజక్షనిస్తాను. ఈయన్ను కనిపెట్టిఉండండి' అని తొలుసంచి పుచ్చుకొని వెళ్లిపోయాడు డాక్టరు.

సత్యవతి కేమీ పాలుపోక ప్రతిమలాకూర్చుంది. రుక్మిణి అప్పుడప్పుడూ ధైర్యం చెబుతూంది.

రెండేసిగంటలకొక్కొక్క ఇంజక్షను చొప్పున



ఆనందం

ఫోటో—బాలచంద్ర కడ్నే
(బొంబాయి-28)

ఇస్తూనే ఉన్నాడు. రోగికి చేయవలసిన ఉపచారాలు చెప్పి వెళ్ళుతున్నాడు.

తెరపి మరుపుగా తెలివొస్తూంది రాజుకు.

మన స్పృహలో లేనప్పుడు ఎక్కువగా కలవరిస్తున్నాడు.

'అస్తమయ అందాన్ని చూస్తూ ఆనందిస్తూ కూడా, కమ్ముకుంటున్న చీకట్లకు భయపడే వెర్రివాడుంటాడా? ఏమో! నేను మాత్రం ఏడుస్తున్నాను, రుక్మిణీ, అస్తమిస్తున్న యౌవ్వనం నీ సౌందర్యంపై వదిలే నీడల్నిచూసి.'

తెల్లబోయి చూసింది సత్యవతి, భర్త కలవరింతలు అర్థంకాక.

కాని రుక్మిణి గ్రహించింది అతని ఉద్దేశ్యం ఏమిటో. తన కళ్లకింద చిన్న ముడతలూ, చెంపల దగ్గర రెండేసి తెల్ల వెంట్రుకలూ— ఇలాటివే రాజుకు భయం కలిగించినవి, అనుకుని రుక్మిణి లజ్జితురాలయి పోయింది.

ఆ మరునాడు డాక్టరు మళ్లీ పరీక్షచేశాడు. ఏదో ఆలోచిస్తున్నట్టు స్టెతస్కోపును అరచేతిలో నెమ్మదిగా కొట్టుకొంటూ చివరి కిలా అన్నాడు.

'దీనికి కారణం మనోవ్యథ. ఈయనకు ఉద్రేకంకలిగించే పరిస్థితులుకలగకుండాచూడండి. ఈయనకు ఇష్టమైనవాళ్లే శ్రద్ధతో సేవచేస్తే గాని ఈ జబ్బు నయమవదు. కాని మీరు గాభరా పడవలసిన పని లేదు. రెండుపూట్లా వచ్చిచూసి ఇంజక్షన్లిస్తూ ఉంటాను...'

అని మరి కొంతసేపు ధైర్యంచెప్పి వెళ్ళిపోయాడు డాక్టరు.

అప్పచెల్లెళ్ళిద్దరూ ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు.

సత్యవతి హఠాత్తుగా బేల అయింది. 'నీకు పుణ్యం ఉంటుందక్కా. నన్నిలాటి అవస్థలో విడిచిపెట్టి ప్రయాణంకాకు. ఆయనకు నువ్వు పరిచర్య చెయ్యకపోతే నా గతి ఏమవుతుందో భయంగా ఉంది' అంది ప్రాధేయపూర్వకంగా.

రుక్మిణి నెమ్మదిగా అంది: 'అదేవిటే. ఉండమని నువ్వు వేరే చెప్పాలా? ఎలాగూ ఉంటాను. అయితే ఇంటి పనులు చక్కబెట్టుకోవడమే తప్ప నేను అతని ఎదుట పడడం మంచిది కాదు.'

'అదేవిటక్కయ్యా, డాక్టరన్నది విన్నావు గదా. ఆయనకు ఇష్టమైనవాళ్ళే చెయ్యాలిట ఉపచారాలు? మరి, నా పొడ అంటేనే ఆయనకు కిట్టదు కదా?....'

'నన్ను చూచినా అతనికి కోపమే సత్యవతీ. నేనతనికి అన్నం వడ్డించడానికి కూడా పనికిరాక పోయాను.'

సత్యవతికి దుఃఖంతో ఒకంతకు మాట పెగల్లేదు. రుక్మిణి వచ్చిన నాటినుంచీ ఇంట్లో జరిగిన ఎన్నో సంఘటనలు జ్ఞాపకం వస్తూ ఆమె మనస్సును అల్లకల్లోలం చేశాయి.

'కోప్పడ కక్కయ్యా. ఆయన వింతప్రవర్తన నాకేమీ అర్థం కాలేదు. కాని ఆయన ఎన్నిసార్లు తిట్టుకున్నా నీ మీద ఆయనకు కోపం లేదని రూఢిగా చెప్పగలను. అన్నివిధాలా నేనే దౌర్భాగ్యురాలిని...' అని కన్నీళ్ళు వచ్చేటట్టు ఉంటే ప్రయత్నంమీద ఆపి చప్పునఅంది: 'ఏమైనా జబ్బు నయమయేదాకా ఆయన్నునువ్వు కనిపెట్టిఉండాలక్కయ్యా.'

పగటిపూట మామూలుగా రుక్మిణే రాజాకు కావలసినవన్నీ చూసేది. రాత్రిళ్ళు ఆగదిలోనే ఆమె నిద్రపోయేది. సత్యవతి మట్టుకు అక్కడే ఓ మూల వాలు కుర్చీలో తెలివిగా ఉండేది.

రాజాకు చాలారాత్రిదాకా నిద్రపట్టేదికాదు. మందు యివ్వడం, టెంపరేచర్ చూడడం మొదలైన పనులకు ఆయా టైములో అక్కయ్యను లేపేది సత్యవతి.

రుక్మిణి ఆరోగ్యం అంతంతమాత్రమే. రాజా ఎరుగును ఈ సంగతి. అయినా అతనికి ఒళ్ళు మండేది నిద్రపోతున్న రుక్మిణిని చూసి. పైగా రుక్మిణికీ తనకూ మధ్య పానకంలో పుడకలా ఎందుకన్న చికాకొకటి.

'అన్నిటికీ అక్కను లేపేదానికి నువ్వెందుకీ గదిలో దెయ్యంలాగ?' అనేశాడు కటువుగా.

సత్యవతితలవంచుకు వెళ్ళిపోయింది బయటికి.

అయితే అతను సత్యవతిని ఏ ప్రయోజనం ఆశించి బయటికి తరిమేశాడో అదిమాత్రం నెరవేరలేదు.

మామూలుగా నిద్రపోతూ ఉంది రుక్మిణి. అతని పనులూ జరిగిపోతూనే ఉన్నాయి క్రమ

# కాంతి కిరణం

ప్రకారంగా.

దీనిలో రహస్యం మరునాడు రాత్రిగాని తెలియలేదతనికి.

ఓ రాత్రప్పుడు తెలివి వచ్చి 'మంచినీళ్ళు' అని గొణుక్కున్నాడు రాజా.

వెంటనే సన్నని గొంతుకతో 'లే అక్కయ్యా. ఆయనకు మంచినీళ్ళియ్యి' అని తలుపు దగ్గిర నుంచి ఒక ఆదేశం వచ్చింది.

రుక్మిణి లేచింది.

రాజా కళ్ళలో ఆశ్చర్యం వెలిగి పోయింది. తాను 'మంచినీళ్ళు' అని గొణుగుకోవడం తనకైనా సరిగా వినిపించిందో లేదో, తన అర్ధాంగికి మట్టుకు వినబడింది.

పక్కగదిలోనుంచి చిక్కని టీ డికాక్షన్ వాసన కొట్టింది. తర్వాత మృదు పద ధ్వనివింటూ సత్యవతి పచారు చేస్తున్నట్లు గ్రహించుకున్నాడు రాజా.

ఖాళీగ్లాసు అందుకుంది రుక్మిణి, రాజానుంచి, పడుకోబోయింది మళ్ళీ.

'రుక్కూ! అని పిలిచాడు రాజా.

'ఏం, రాజశేఖరరావు?'

'సత్యవతికి నేనంటే అభిమానం ఉన్నట్లు కనబడుతోంది సుమా.'

'ఎందుకుండదయ్యా. మీ రిద్దరూ సావరస్యంగా—'

ఇంతలోనే ఏదో అనుమానం మెదిలినటు ంది రాజా బుర్రలో.

'అది కాదు. మన్ని కాపలా కాయడానికి ఇన్ని తంటాలూ పడుతూంది' నిద్రపట్టకుండా, అంటూ పళ్ళు పటపట లాడించాడు.

చెడ్డ సిగ్గు వేసింది రుక్మిణికి.

'రుక్కూ' తాపీగా పిలిచాడు మళ్ళీ.

'ఏమయ్యా?'



'నిన్నిలా పిలిస్తే ఏమేనా అనుకుంటావా?'

'నే నెందుకనుకుంటానయ్యా?' అంటూ రుక్మిణి రాజా మంచం దగ్గర చిన్న బల్లమీద కూర్చుంది. 'నువ్వుకుర్రాడివి, నన్నెలా పిల్చినా తప్పులేదయ్యా' అంది నెమ్మదిగా.

రాజాకు చిర్రెత్తుకొచ్చింది. 'చెట్టంత మనిషిని పట్టుకు కుర్రవెధవ కింద జమకడతావేమిటి రుక్కూ? నీకు నా చేత చీవాట్లు తినాలనుందా?'

'*ఉద్రేకపడకు నాయనా, నువ్వు రెండన్నా*నేను రెండు పడినా ఏం ఫరవాలేదు. కాని నీ ఒళ్ళు జాగ్రత్తగా చూసుకో. ఆరోగ్యవంతుడవయ్యాక నీఇష్టమొచ్చినన్ని అను, నే నిక్కడే ఉంటాలే. ఒక వేళ ఉండకపోయినా పోస్టుద్వారా అందజేద్దువుగానిలే నీ దీవనల్ని' అని నవ్వసాగింది రుక్మిణి.

అదే నిష్కల్మషమైన నవ్వు 'టాలిస్‌మన్'లా రుగ్మతను ఎగరగొట్టేనవ్వు.

కాని రాజా ముఖం ఎందుకో దీనంగా అయిపోయింది. బరువుగా అన్నాడు. 'నీ కెప్పుడూ నవ్వులాటగానే ఉంటుంది రుక్కూ. నే నెంత వేదనను అనుభవిస్తున్నానో నీకు తెలీదు—'

రుక్మిణి గంభీరంగా 'నాకు తెలుసు' అని మాత్రం పలికి కొంతసేపు ఊరుకుంది.

కడకు బతిమాలుతున్నట్టుగా జాలిగొలిపే మధురస్వరంతో ఇలా అంది.

'ఆవేశపడక నీ జబ్బు నయమయే దారిచూడు నాయనా. సత్యవతి బెంగతో సగమైపోయింది. నీ బాధంతా తెలిసిన నేను నీకేం చెప్పగలను? చెల్లెలి మనస్సును తెలుసుకుంటే ఇక నీ సంసారం స్వర్గమే. అదుగో, మాట్లాడకు. ఎందరో ఇలాటి వ్యధలను తమ హృదయాల్లో అట్టడుగుకు అణగదొక్కి బతుకుతున్నారు. నువ్వయినా మరెవరయినా అంతే చెయ్యాలి.

* * *

రాజా జబ్బు నయమయిన తరువాత కొన్నాళ్ళుండి మళ్ళీ అన్నగారి యింటికి వెళ్ళిపోయింది రుక్మిణి. క్షేమంగా చేరినట్టు ఒక కార్డువచ్చింది.

రాజా ఇంకా నీరసంగా ఉన్నాడు. కాని ఇంటికి రాగానే అతని మనస్సులోని కోరికను కనిపెట్టి అన్నీ ఏర్పాట్లు చేస్తూ చిరునవ్వు లొలకబోస్తూ సత్యవతి అతని హృదయాన్నిఆనందం సాగరంతో నింపుతోంది. ఇప్పటికీ ఆమె మితభాషిణి. కాని రాజా మట్టుకు మునుపటిలాగు విసుగుకోవడం లేదు. తనమీద ఆమెకు గల ప్రేమ జలపాతంకాదు ధ్వని చెయ్యడానికి; తన హృదయ సముద్రంలో నెమ్మదిగా వచ్చి కలిసే స్వచ్ఛమైన గంగా వాహిని అది.

*ఓ రోజు ఆఫీసునుంచి రాగానే చేతిలో కొన్ని* కాగితాలతో గోడవారకుని విచారంగా కనబడింది సత్యవతి రాజాకు.

భర్తను చూడగానే చిరునవ్వు మొలిపించుకుని చప్పున [illegible], లోపలికి వెళ్ళిపోబోయింది

సత్యవతి, ఎప్పుడూలేనిది.

'సత్యవతీ, ఏమిటది?'

ఆగి బెదరినట్టు చూచింది సత్యవతి. 'ఉత్తరవండీ' అక్కయ్య రాసింది.'

'ఏం రాసింది మీ అక్క. నన్ను చూడనీ.'

'ఆ ఏవుంది మామూలు సంగతులే— అన్నయ్య కీ మధ్య జలుబుచేసిందనీ వదిన మళ్లీ నీళ్లు పోసుకుందనీ...'

రాజా నవ్వాడు. 'రసవంతమైన అబద్ధాలు కల్పిస్తూ కాటుక కళ్లలో ఆ భయాలేమిటో ఇలా ఇయ్యి' అంటూ రాజా ఆమె చేతిలోని ఉత్తరం తీసుకున్నాడు.

బతిమాలుకుంటున్నట్టు అంది సత్యవతి. 'మీకు పుణ్యం ఉంటుంది. నా మాట విని అది చదవకండి. మిమ్మల్నెంతో బాధపెడుతుంది ఆ ఉత్తరం.'

జాలిగా సత్యవతి వైపొకసారి చూసి కుర్చీలో కూర్చుని ఉత్తరం చదవ సాగాడు రాజా.

అత సలా చదువుతున్నంతసేపూ భయం భయంగా చూస్తూ నిల్చుంది సత్యవతి.

ఉత్తరంలో కొన్ని కొన్ని భాగాలు రాజాకు బాధ కలిగించినట్టు స్పష్టంగా తెలుస్తూనేఉంది.

అప్పుడప్పు డతను సత్యవతివైపు చూస్తాడు. ఆమె రెప్పలు వాలిపోతాయి. రాజాకు గగుర్పాటు కలుగుతుంది—ఆమె ఆందోళన చూసి. తన కష్ట సుఖాలకు భయమూ, ఆనందమూ పొందే టంత ఆత్మీయురాలు తనకింద దగ్గరలోనే ఉంది గదా!

ఉత్తరం అంతా చదివి బరువుగా నిట్టూర్చి మౌనంగా ఉండిపోయాడు రాజా.

సత్యవతి కూడా ఏం మాట్లాడలేక అతని భుజంమీద చెయ్యివేసి నిల్చుంది.

ఆ ఉత్తరంలో ఇలా ఉంది:

'చి.సౌ. సత్యవతికి మీ అక్క ఆశీర్వదించి వ్రాయునది: ఈ ఉత్తరం వ్రాయడమా, మానడమా అని ఊకొట్టుకు పోతున్నాను. కాని మీ ఆయన ప్రవర్తన నీకు సరిగా అర్థంకాలేదు. అతన్ని పూర్తిగా అర్థం చేసుకుంటేగాని' నీ కాపరం సాఫీగా సాగదు. ఇలాటి ఉత్తరం రాయడం నాకు అదోలా ఉన్నప్పటికీ నీ సౌఖ్యం కోసం రాయక తప్పదు.

'ఒక్కటి చెబుతా, నమ్మ, నమ్మకపో. నీ మొగుడు వట్టి పసి బిడ్డడు. కుర్రనాగమ్మ కుండవలసిన లక్షణాలన్నీ ఉన్నాయి మీ ఆయనలో. అతనిది జాలిగుండె. భావనా శక్తి విపరీతం అతనికి. ఊహాలోకాల్లో ఎప్పుడూ నివసించే అతనికి మన ప్రపంచపు సంగతులూ, ఇక్కడి కట్టుబాట్లూ ఏవీ తెలియవు. కొద్దో గొప్పో తెలిసినా పట్టించుకోడు.

'విశదంగా రాస్తానుండు.

'అతను నన్ను చూసిన తొలిరోజుల్లో నేను ఇంటిపనుల్లోను బజారు పనుల్లోనూ, తలమున్కగా ఉండి, కనిపించేదాన్ని. నడి వయస్సులో ఉన్న తల చెడ్డదాన్ని, నా దౌర్భాగ్యం చూసి, పాపం, అతనికెంతో జాలివేసి ఉంటుంది.

'నా చక్కదనమూ, చిరునవ్వులూ, మాట తీరూ ఏమంత గొప్పవి చెప్పు? కాని జాలితో నిండిపోయిన అతని మనస్సులో గోరంతలుగా ఉన్న నాగుణాలేవో కొండంతలయి పోతున్నాయి. రోజు రోజుకూ గాఢమయి పోతున్న తన జాలినే నామీద ప్రేమనుకున్నాడు అతను. ఇలాటి భ్రాంతి అందరికీ ఉంటుంది. ఆకర్షణా, జాలీ, స్నేహమూ తప్ప ప్రేమ ఎక్కడుందనలు? కాని జాలిని ప్రేమనుకునే మహామహులు ఎక్కడో మాటికి కోటికీ ఒక్కరుంటారేమో. మీ ఆయన భావనవల్ల వచ్చిందీ చిక్కంతా.

'ఎంత నన్ను ప్రేమించానన్న భావనలో ఉన్నప్పటికీ కాస్త లోకం పోకడ తెలిసినవాడైతే రాజశేఖరరావు అలా చెలరేగి పోడు. ఈ లోకం కట్టుబాట్ల ననుసరించి నాలాటి పరస్త్రీ మీద అతనటువంటి కోరిక పెట్టుకొనే కూడదు. తప్పిదారి అలాటి భావం ఏదో పడుచు దనం వేడిలో కలిగినా, దాన్ని అతను అణుచు కోవాలి. నే నతనికి చిక్కలేదనే వ్యథవల్ల లోకంమీదే కోపం వచ్చిందతనికి. ఈ పాటికి నీకు బోధపడే ఉంటుంది. అతని అలాటి నడతకు కారణం ఏమిటో?

'పోనీ అమ్మా లోకం సొద మనకొద్దు, అనుకున్నా అతను ఎలాటి అమ్మాయి నైనా వాంఛించవచ్చుగాని నాలాటి ఆడుదాన్ని మట్టుకు తలచనైనా తలచ కూడదు. ఈడూ, జోడూ కాని వాళ్లమధ్య వ్యామోహం ఏమిటి అతని వెర్రిగాని! నేను తనకంటే పదేళ్ళు పెద్దఅని గుర్తించడే అతను. పోనీ నాకు వయసు మీరినా అతనికి లెక్కలేదేమో అనుకుంటే, అదీకాదు.

'నీకు తెలును, నే నేనాటివో కథలూ, గాథలూ అన్నీ చెబుతూ ఉంటానని కబుర్లలో. అలాగే అతనితో కూడా ఎప్పటివో సంగతులు చెబుతూ ఉండేదాన్ని. అత నోసారి ఇహ దుఃఖం పట్టలేక 'పాతకాలపు కథలను రానీకు మనమాటల్లోకి' అని దాదాపుగా కన్నీళ్లు పెట్టుకున్నాడు. మరో సారి'చెట్టంతమనిషిని పట్టుకు కుర్రవెధవ కింద జమకడతావేమిటి రుక్కూ—' అని కసురుకున్నాడు. నా గుండె దడ దడలాడిపోయింది. మొదట్లో నాకు అర్థం కాలేదు. అతని తత్వం తర్వాత తెలుసుకున్నానులే. నేను ఏళ్లు నెత్తి కొచ్చినదాన్నని జ్ఞాపకం చేసే ఏ సంఘటన జరిగినా సరే, తల్లకిందులైపోతా డతను.

'అందరూ తనను అనుమానిస్తున్నారనే భయంతో ఉండేవాడు మీ ఆయన అప్పట్లో. నేను దవడ సలుపుతో బాధ పడుతున్ననాడు 'నేనేం చేసినా అక్కయ్య బాధ ఉపశమించడానికి చేస్తాను' అని నువ్వన్నమీదట అతనలా మాట్లాడడం, నీ మీద కోపంచేత అనుకుంటున్నావా? లేదు. తననీడ చూసుకుని తనే భయపడ్డంవల్ల.



'వయసులో ఉన్న అందరికీ సహజమే ఇలాటి వ్యామోహాలు. అయితే ఇతనంతగా ఎవ్వరూ భ్రమ పడరు. అదీగాక మీ ఆయన ఏదీ కడుపులో దాచుకో లేడు. అంచేత నువ్వతని మీద కోప్పడకూడదు. సరిగదా, మరింత అభిమానించాలి. మూణ్ణాళ్లలో అన్నీ మరిచి పోతాడు. అర్థంలేని అనుమానాలు పెట్టుకుని పండంటి కాపరం పాడు చేసుకోకు. పసిపిల్లలాటి బిడ్డల్నికని కలకాలం మీ రిద్దరూ సుఖంగా ఉండాలనే నా ఆశా, ఆశీర్వాదమూ.

'ఎవరో ఒకరి చేతిమీదుగా వాళ్ళబతుకు వెళ్లిపోతే చాలనే తప్ప నాకు వేరే ఆశలేమీ లేవు ఈ జన్మకిక. నే నెవరిదారిలోనూ అడ్డుగా ఉండను. ఉండలేను.

నీ,

రుక్మిణీ,

భర్త మౌనం సత్యవతి భరించలేకపోయింది. 'మాట్లాడరేమండి?' అని అతని ముఖం మీదికి వంగింది.

రాజా ఆమె కళ్లలోకి చూస్తూ—'ఏం మాట్లాడమంటావు సత్యవతీ? మీ అక్కయ్య జీవయాత్ర కిరణం లాంటిది. కాంతికిరణమైనా ఒంగుతుంది కాస్త, బలమైన ఆకర్షణకు లోనయినపుడు, ఐన్‌స్టయిన్ కనుక్కొన్నట్టు. ఈమె మట్టుకు తన దారినుంచి తప్పకుండా వెలుగు నింపుతుంది తనకు తారసిల్లిన వాళ్ల జీవితాల్లో' అన్నాడు.

సత్యవతి నవ్వింది.

'మీ ఊహల వాస్తవికతకు రంగులు పులుముతున్నారు. తన పరువు, మర్యాదలు ముఖ్యమయిన ఏ స్త్రీ అయినా రుక్మిణీ చేసి నట్టే చేస్తుంది నిజానికి' అనేమో ఆ నవ్వుకు అర్థం.

ఇదంతా కొన్నాళ్ల క్రిందట సంగతి.

ఇప్పుడు—

అసహాయ స్థితిలో అమ్మ ఒడిలో వాలేపిల్ల వాణ్నే, హృదయానికి అదుముకుని కాపాడుతుంది తల్లి. అలాటి వెచ్చని ఘడియల్లో జీవితం వారిద్దరిపై వర్షించే మాధుర్యం వంటి మాధుర్యమే అనుదినమూ అనుభవిస్తున్నారు సత్యవతీ, రాజశేఖరరావులు. ★